క్లుప్తంగా

19న భీమవరం ధన్వంతరి మహర్షి జయంతి



భీమవరంలో ధన్వంతరి మహర్షి జయంతి కార్యక్రమ వివరాలు వెల్లడిస్తున్న నాయకులు

భీమవరం: ఆయుర్వేద వైద్య మూలపురుషులు ధన్వంతరి మహర్షి జయంతి అక్టోబర్ 19న భీమవరం మెంటేవారి తోటలోని నాయి బ్రాహ్మణ సేవా సంఘం కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించనున్నట్లు భీమవరం డివిజన్ నాయి బ్రాహ్మణ ఉద్యోగ సాంస్కృతిక సంక్షేమ సంఘం అధ్యక్ష ,కార్యదర్శులు మలువలస శ్రీమన్నారాయణ, నాగేశ్వరరావులు చెప్పారు. మంగళవారం భీమవరంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాలతో పాటు ముఖ్య పట్టణాల్లో నాయి బ్రాహ్మణ ఉద్యోగ సంక్షేమ సంఘం, నాయి బ్రాహ్మణ వృత్తిదారులు సంయుక్తంగా ధన్వంతరి జయంతి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయి బ్రాహ్మణ ఉద్యోగ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వీ సత్యనారాయణ, సీహెచ్ బంగర్రావు, మల్లువలస రాము, చోడవరపు లెనిన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



జువ్వలపాలెంలో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి భార్గవిసత్య

కాళ్ల: పాడి రైతులు తమ పశువులకు సోకే గాలికుంటు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి కె.భార్గవి సత్య తెలిపారు. కాళ్ల మండలం జువ్వలపాలెం గ్రామంలో మంగళవారం గాలికుంటు వ్యాధి నివారణా టీకాల కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా పలు పాడిపశువులకు ఆమె టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి వైరస్ వల్ల వస్తుందని తెలిపారు. ఈ వ్యాధి సోకిన పశువులకు జ్వరం, నోటి నుంచి చొంగరావడం, కాలిగిట్టలకు పుండ్లు, నిరసించి పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. అదేవిధంగా పాల ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా తగ్గిపోతుందన్నారు. సకాలంలో వైద్యం అందించకపోతే వ్యాధి తీవ్రత పెరిగి పశువు చనిపోయే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అక్టోబర్ 15 వరకు ప్రతి గ్రామంలోనూ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరుగుతుందని వీటిని రైతులందరూ వినియోగించుకోవాలని ఆమె కోరారు.

జీఎస్టీ సంస్కరణలతో ఆర్థిక వ్యవస్థ పటిష్టం



జీఎస్టీ అవగాహన కార్యక్రమంలో స్వయంగా ట్రాక్టర్ నడుపుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: జీఎస్టీ సంస్కరణలతో భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టం అవుతుందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. మంగళవారం భీమవరం లూథరన్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ రంగంలో చేకూరిన ప్రయోజనాలపై అవగాహన కలిగించేందుకు ఏర్పాటుచేసిన ట్రాక్టర్స్ ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి, రాజ్యసభ సభ్యుడు పాక వెంకట సత్యనారాయణ,భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు), ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు,జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే భీమవరం కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయంలో జీఎస్టీపై అవగాహన ప్రచార కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.

ఆలయంలో అల్పాహారం పంపిణీ

యలమంచిలి: మండలంలోని గుంపర్రు శ్రీ వల్లీ దేవ సేనా సమేత సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయంలో ప్రతి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. బ్రహ్మశ్రీ మానేపల్లి రామ లింగేశ్వరరావు ఈ విజయ దశమినుంచి ఆలయాని కివచ్చే భక్తులకు అల్పాహారం అందివ్వాలని సూచించారు.

వైద్యుడిపై విచారణ

ఆకివీడు: స్థానిక సీహెచ్‌సీలో పనిచేస్తున్న దంత వైద్యులు విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని వచ్చిన ఆరోపణలపై భీమవరం ఏరియా ఆసుపత్రి వైద్యులు ప్రవీణ్ కుమార్ విచారణ నిర్వహించారు. జిల్లా ఆసుపత్రుల కోఆర్డినేటర్ పగడాల సూర్యనారాయణ ఆదేశాల మేరకు విచారణ చేపట్టారు. ఆకివీడు సీహెచ్‌సీ, ఉండి, కాళ్ల, పెదకాపవరం పీహెచ్‌సీల్లో విధులకు హాజరు అవుతున్నదీ లేనిది ఆయా వైద్యుల ద్వారా లిఖిత పూర్వక నివేదిక తీసుకున్నారు. కాగా దంత వైద్యులు మూడు రోజులు ఆకివీడు సీహెచ్‌సీలోనూ, మరో మూడు రోజులు రూరల్ పీహెచ్‌సీల్లో పనిచేయాల్సి ఉండగా, ఆయా పీహెచ్‌సీలకు వెళ్లడం లేదని ఫిర్యాదులు అందడంతో విచారణకు ఆదేశించినట్లు చెప్పారు.

రహదారి అధ్వానం



చినపుల్లేరు రోడ్డు అధ్వాన్నంగా మారిన దృశ్యం

- రెండు మండలాలకు మధ్యమార్గం ఇంతేనా?
- ఈ రోడ్డులో ప్రయాణం అంటే నరకం

ఉండి: రెండు మండలాలకు మధ్యస్థంగా ఉన్న రహదారి ఉండి చినపుల్లేరు, పెదపుల్లేరు, సీసలి రోడ్డు. ఈ రోడ్డులో ప్రతిరోజు వందలాది వాహనాలు, భారీ వాహనాలు, ఆటోలు, కార్లు, ద్విచక్రవాహనాలు ఇలా పెద్ద ఎత్తున ప్రయాణాలు సాగిస్తూ ఉంటాయి. గతంలో కొద్దో గొప్పో బాగుండే రోడ్డు కూటమి ప్రభుత్వ చలవతో అధ్వాన్నంగా మారిపోయింది. సుమారు 6కి.మీ.రోడ్డులో పెద్దపెద్దగోతులతో పాటు రోడ్డు కోతకు గురికావడంతో మరికొన్ని ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదకరంగా మారిపోయింది. ఈ రోడ్డులో ప్రయాణం అంటే ఉండి నుంచి సీసలి వరకు ప్రయాణికుల ప్రాణాలకు ప్రమాదం వాటిల్లినట్లే అన్నట్లుగా ఉంది. ముఖ్యంగా చినపుల్లేరు గ్రామ సమీపంలోను, పెదపుల్లేరు చినపుల్లేరు గ్రామ సరిహద్దు మలుపులోను రోడ్డు అధ్వాన్నంగా మారిపోయింది. రోడ్డుపై ప్రయాణించాలంటే ఆటో డ్రైవర్‌లు వణికిపోతున్నారు. ఉండికి 3కి.మీ. దూరంలో ఉన్న పెదపుల్లేరు వరకు గతంలో కొద్దిదూరం మరమ్మతులు చేసిన అధికారులు పెద్దపెద్ద గోతులను మాత్రం పట్టించుకోక పోవడం గమనార్హం. దీంతో రోజురోజుకు గోతులు పెద్దవి కావడంతో పెదపుల్లేరు, చినపుల్లేరు ప్రయాణం అంటే వాహనదారులు భయపడే పరిస్థితి దాపురించింది. పగటి వేళల్లోనే ప్రయాణం నరకంలా ఉంటే ఇక రాత్రి సమయంలో ఈ రోడ్డులో ప్రయాణం అంటే ఎంత దారుణంగా ఉంటుందో అధికారులు అర్థం చేసుకోవాలంటూ స్థానికులు, వాహనదారులు, ప్రయాణికులు కోరుకుంటున్నారు.

రోడ్డుపైన వర్షపు నీరు

అలాగే పెదపుల్లేరు, చినపుల్లేరు గ్రామాల పరిధిలోని శివారు ప్రాంతాలకు వెళ్లాలన్నా రహదారులు తీవ్ర ఇబ్బందికరంగా ఉన్నాయి. పెదపుల్లేరు శివారు మేడవరం వెళ్లాలంటే సుమారు కి.మీ దూరం ఉంది. ఈ రోడ్డుపై గత వేసవిలో మట్టిమాఫియా విజృంభణతో రోడ్డు దారుణంగా మారిపోయింది. ఈ రోడ్డుపై ప్రయాణం అంటే ఒకింత ఇబ్బందికరంగానే మారిపోయిందని స్థానికులు వాపోతున్నారు. అలాగే చినపుల్లేరు శివారు తల్లమ్మచెరువుకు వెళ్లాలంటే సీసీ రోడ్డు ఉంది. అయితే వర్షం కురిసిన సమయంలో మాత్రం సీసీ రోడ్డుపైనే నీరు నిలిచి ఉండటంతో స్థానికులు పలు ప్రమాదాల భారినపడ్డారు. ముఖ్యంగా పెదపుల్లేరు నుంచి తల్లమ్మ చెరువు వెళ్లే రోడ్డు మలుపులో, దానికి ముందు ఉండే మలుపులో వర్షపు నీరు సీసీ రోడ్డుపైనే నిలవడంతో వాహనాలు జారిపోతున్నాయంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా లింక్ రోడ్డు

వాంద్రం నుంచి పెదపుల్లేరుకు చేరుకునే లింక్‌రోడ్డు మరింత అధ్వాన్నంగా మారిపోయింది.గతంలో చినపుల్లేరు రోడ్డు బాగుండకపోతే ప్రయాణికులు పెదపుల్లేరు లేదా వాంద్రం నుంచి కాళ్ల మండలానికి చేరుకునే వారు కానీ ఇప్పుడు లింక్‌రోడ్డు కూడా దారుణంగా మారడంతో ప్రయాణికుల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్నట్లుగా మారిపోయింది.

రోడ్డు బాగుచేసి పుణ్యం కట్టుకోండి



గతంలో దాతల సహకారంతో పెదపుల్లేరు మెయిన్ రోడ్డు వద్ద కార్నర్ నుంచి తల్లమ్మచెరువుకు సీసీ రోడ్డు వేశారు. ఇప్పుడు ఆరోడ్డు చాలా ప్రాంతాల్లో పాడైంది. వర్షాకాలంలో అయితే వర్షపునీరు నిలిచిపోవడంతో చాలా ఇబ్బందులకు గురవుతున్నాం.అధికారులు, ప్రజాప్రతినిధులు ఒక్కసారి పరిశీలన చేసి చర్యలు చేపట్టి పుణ్యంకట్టుకోండి.

దండ సురేష్‌బాబు, తల్లమ్మచెరువు

రెండు మండలాలను కలిపే రోడ్డు ఇలాగేనా?



రెండు మండలాలను కలిపే రోడ్డు చాలా ధృఢంగా బాగుండాలి. కానీ చిన్నపాటి చెరువులను తలపించేలా రోడ్డు ఉంటే ప్రయాణికుల పరిస్థితి ఏంటీ? పగటి సమయంలో పరవాలేదు ఏదోలా వాహనదారులు తప్పించుకుని ప్రయాణిస్తారు. కానీ రాత్రి వేళల్లో ఈ రోడ్డులో ప్రయాణించాలంటే ఏంటి పరిస్థితి, వాహనదారులు, ప్రయాణికుల ప్రాణాలు గాలికి వదిలేసినట్టే కదా.అలోచించండి.

పీవీఆర్‌కే ఆంజనేయరాజు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు

ఘనంగా ప్రారంభమైన అజ్జాలమ్మ జాతర

ఆకివీడు: మండలంలోని అజ్జమూరు గ్రామ దేవత అజ్జాలమ్మ అమ్మవారి 21వ జాతర మహోత్సవాలు మంగళవారం వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. పంచామృతాలతో అభిషేకాలు, సుగంధ పుష్పాలతో అలంకరణచేశారు. 108 బిందెలతో మహిళలు, గ్రామ ఆడపడుచులు అమ్మవారికి జలాభిషేకం చేశారు. 1వ తేదీన అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు, చలివిడి పానకాలు అందజేస్తారు. విజయదశమిసందర్భంగా 2వ తేదీ గ్రామంలో అమ్మవారి జాతర మహోత్సవ సంబరం నిర్వహించనున్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న చినమిల్లి



చినమిల్లి వెంకటరాయుడిని సన్మానిస్తున్న గణేష్ యూత్ సభ్యులు

భీమవరం అర్బన్: మండలంలో విజయ పేరంటాలమ్మ అమ్మవారిని భీమవరం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకటరాయుడు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గణేష్ యూత్ సభ్యులు ఆయనకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నవుడూరులో ఆర్టీసీ బస్ స్టేజ్ ఏర్పాటు చేయాలి



భీమవరంలో ఆర్టీసీ ఆర్ఎం ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భీమవరం: అనేక గ్రామాలకు కేంద్రంగా ఉన్న నవుడూరు సెంటర్‌ను ఆర్టీసీ స్టేజి ఏర్పాటు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం భీమవరంలో ఆర్టీసీ ఆర్ఎంకు వినతి పత్రం అందజేశారు. నవుడురు గ్రామ సర్పంచ్ నల్లమిల్లి వేణుక, ఎంపీటీసీ యాళ్లబండి ఇందిర ఆర్టీసీ స్టేజ్ ఏర్పాటు చేయాలని ప్రజల నుంచి సంతకాలు సేకరించి ఆర్‌టీసీ రీజనల్ మేనజర్ వరప్రసాద్‌ను కలసి అందించారు. అనంతరం వేణుక, ఇందిర మాట్లాడుతూ ఎన్నో గ్రామాల ప్రజలకు ఉపయోగయోగ్యమైన నవుడూరు సెంటర్‌లో ప్రతి నిత్యం అనేకమంది ప్రయాణీకులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తారని భీమవరం నుంచి రాజమండ్రి వెళ్లే బస్సు ఎక్కితే టికెట్‌పై పాలమూరు ఉంటుందని అదే రాజమండ్రి నుంచి భీమవరం వచ్చే టికెట్‌పై పంజా వేమవరం ఉంటుందని దీనివల్ల నవుడూరు సెంటర్లో ప్రయాణికులకు అసౌకర్యం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం నవుడూరు సెంటర్ స్టేజ్ ఏర్పాటు చేయాలన్నారు. దీనికి స్పందించిన ఆర్టీసీ ఆర్ఎం వరప్రసాద్ మాట్లాడుతూ కిలోమీటర్ల వ్యవధిని సర్వే చేసి స్టేజ్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామన్నారు. వినతి పత్రం అందించిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ. సీపీఎం నాయకులు లింగం సత్యనారాయణ .యాళ్లబండి మారియ్య నాయుడు, యాళ్లబండి బాబి. నల్లమిల్లి శ్రీనివాస్ తదితరులున్నారు.

పార్టీ శ్రేణులకు అండగా డిజిటల్ బుక్



డిజిటల్ బుక్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : పార్టీ శ్రేణులకు అండగా ఉండేందుకు జగనన్న డిజిటల్ బుక్ ప్రారంభించారని మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. కూటమి ప్రభుత్వం విధానాల కారణంగా ఎవరికైనా ఇబ్బందులు ఎదురైతే వాటిని డిజిటల్ బుక్‌లో నమోదు చేసుకోవాలని, పార్టీ తప్పకుండా అండగా నిలుస్తోందని స్పష్టం చేశారు. మంగళవారం డిజిటల్ బుక్ పోస్టర్లను ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా వారిపై కూటమి ప్రభుత్వం అక్రమంగా పోలీసు కేసులు నమోదు చేయిస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వ దుర్మార్గానికి బలైన వారు ఈ డిజిటల్ బుక్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని క్యూఆర్‌కోడ్ ద్వారా తమకు జరిగిన అన్యాయాన్ని తెలియజేయవచ్చునని తెలిపారు. దుర్మారంగా కేసులు నమోదు చేసిన అధికారులపై అధికారం చేపట్టిన తక్షణం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటుందన్నారు. అధికారులు రిటైర్ అయినా, లేక విధుల్లో ఉన్నా ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్ పార్టీ నాయకులకు, కర్యకర్తలకు, సోషల్ మీడియా వారికి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరి భాస్కరరెడ్డి, రెడ్డి సూరిబాబు, బొద్దాని శ్రీనివాస్, కొలుకులూరి ధర్మరాజు, ముప్పిడి సంపత్‌కుమార్, జడ్డు హరిబాబు, తమ్మిశెట్టి రఘు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వసుధ ఫౌండేషన్ చేయూత



భీమవరం పట్టణం దుర్గాపురంలో కుట్టు శిక్షణలో మెలకువులు తెలుసుకుంటున్న మహిళలు

భీమవరం: వసుధ ఫౌండేషన్ సహకారంతో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎస్సీ మహిళలకు ఉచితంగా కుట్టు, శారీ పెయింటింగ్ వంటివాటిలో ఇస్తున్న శిక్షణ మహిళలకు ఎంతగానో దోహదపడుతోంది. స్వశక్తిపై ఎదగాలనే కోరిక, కొత్తగా నేర్చుకోవాలని ఉత్సాహం ఉన్న మహిళలకు వసుధ చేయూతనిస్తోంది. దీనిలో భాగంగా భీమవరం పట్టంలోని దుర్గాపురం అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా కేంద్ర భవనంలో గత రెండున్నర నెలలుగా సుమారు 30 మంది ఎస్సీ వర్గానికి చెందిన మహిళలకు శిక్షణ ఇచ్చారు. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇద్దరు కుట్టుశిక్షణ, శారీపెయింటింగ్ టీచర్స్ వీరికి శిక్షణ ఇచ్చారు. కుట్టు మిషన్స్, వసతిని వసుధ ఫౌండేషన్ సమకూర్చగా స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ నాక్ ఆధ్వర్యంలో ఆశక్తి కలిగిన మహిళలను ఎంపికచేసి వారికి వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షణ పొందిన వారిలో ఆరుగురు నిరుపేదలకు ఉచితంగా కుట్టుమిషన్స్ పంపిణీ చేయనున్నట్లు కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు చెప్పారు.

పనిభారం కూటమి కుతంత్రం

- 13 గంటల పని కార్మికుల ప్రాణానికి హాని
- కరోనాతో కుంచించుకుపోయిన ఆరోగ్యం



స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఆకివీడు: కార్మికులపై పని భారం పెంచడం కూటమి కుతంత్రమేనని సీఐటీయూ మండల కార్యదర్శి కే.తవిటినాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక సంఘ కార్యాలయం వద్ద మండల కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. సమావేశానికి మండల నాయకులు పెంకి అప్పారావు అధ్యక్షత వహించారు. తవిటినాయుడు మాట్లాడుతూ కరోనాతో ప్రజలు, కార్మికుల ఆరోగ్యాలు కుంచించుకుపోయాయన్నారు. అంతంత మాత్రంగానే ఉన్న ఆరోగ్యంతో పూట గడవడం కష్టమైనప్పటికీ పనులకు వెళ్లి కార్మికులు ఉపాధి పొందుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వంలోని చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల ఆధ్వర్యంలో 13 గంటల పనిదినాల్ని తీర్మానం చేయడం దారుణమన్నారు. 8 గంటల పనిదినాలతో కార్మికుల కండలు కరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పనిదినాల పెంపు ఎవరికో సమో చెప్పాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల వద్ద కార్మికులకు సరైన వసతులు లేవని, లేబర్ అధికారులు, ఫ్యాక్టరీ ఇన్స్‌పెక్టర్లు ఆయా పరిశ్రమల్ని తనిఖీలు చేసిన దాఖలాలు లేవని తవిటినాయుడు ఆరోపించారు. రాత్రిపూట మహిళా కార్మికులు పనులు చేయడానికి కూడా తీర్మానం చేయడం దారుణమన్నారు. కార్మికులకు రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. పని దినాల్ని వెంటనే తగ్గించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో బీరా శ్రీను, మనోహర్, తోట పద్మ, కన్యాకుమారి, బీ.అప్పలనాయుడు, నెల్లి సూరిబాబు, ప్రవీణ్, నాగమణి, గండేటి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో దేవీ నవరాత్రులు

ఆకివీడు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా మంగళవారం దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహంచారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. స్థానిక రాజరాజేశ్వరిసహిత మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి కుంకుమ పూజలు చేసి, లలితా సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం లక్ష్మీదేవిగా కొలిచే గోవుకు శ్రీమంతం చేసి ప్రత్యేక పూజలు చేశారు. పౌష్టికాహారం అందజేశారు.

మావుళ్లమ్మకు విశేష పూజలు

భీమవరం(ప్రకాశం చౌక్): దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భీమవరం పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మ అమ్మవారు మంగళవారం దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ పూజలు, చండీ హోమం నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

పంచారామక్షేత్రం:

పంచారామక్షేత్రం ఉమాసోమేశ్వర జనార్థన స్వామి వారి దేవస్థాంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో మంగళవారం పార్వతీదేవి అమ్మవారు దుర్గాదేవిగా ప్రత్యేక పూజలు అందుకున్నారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి డి.కృష్ణంరాజు ఆలయ అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.



ఆకివీడు: మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో గోమాతకు పూజలు చేస్తున్న మహిళలు

భీమేశ్వర స్వామి వారి దేవస్థానం:

భీమేశ్వర స్వామి వారి దేవస్థాంలో కొలువైన శ్రీమహిషాసురమర్ధనీ అమ్మవారి దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో మంగళవారం దుర్గాదేవిగా పూజలు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి తోట శ్రీనివాస్, ఆలయ అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.



భీమవరం (ప్రకాశం చౌక్): దుర్గాదేవి అలంకరణలో మావుళ్లమ్మ

ధనలక్ష్మి అలంకరణలో కనకదుర్గమ్మ

కాళ్ల: కాళ్ళ మండలం, కోపల్లె గ్రామంలో కనకదుర్గమ్మ, శ్రీపరాలమ్మ అమ్మవార్లకు దసరా మహోత్సవాలు సందర్భంగా 9వ రోజైన మంగళవారం ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా అమ్మవారిని సుమారు రూ.5 లక్షల రూపాయల కరెన్సీ నోట్లతో విశేషంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. అలాగే వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో 9వ రోజైన మంగళవారం అమ్మవారు గాయత్రిదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



ఆకివీడు: దుర్గమ్మ అలంకరణలో పెద్దింటి అమ్మవారు



కాళ్ళ: వెంకటేశ్వరస్వామి ఆలయంలో విద్యాలక్ష్మి అలంకరణ



కాళ్ళ: ధనలక్ష్మి అలంకరణలో కోపల్లె కనకదుర్గమ్మ



భీమవరం(ప్రకాశం చౌక్): భీమేశ్వరస్వామి ఆలయంలో విశేష అలంకరణ



భీమవరం(ప్రకాశం చౌక్): దుర్గాదేవి అలంకరణలో పార్వతిదేవి



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

భీమవరం డివిజన్

90102 23729

90108 51166

Office mail : tpgadvt@gmail.com